



పి.గన్నవరం మండలం పోతవరంలో బరి వద్ద హెచ్చరిక బ్యానర్



బెదరని బరి

పోలీసులు వద్దంటున్నారు..నిర్వాహకులు సై అంటున్నారు. సంక్రాంతి పర్వదినాల్లో జూద క్రీడల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోను కోడి పందాలు, గుండాటలు, పేకాటలు, అశ్లీల నృత్యాలు నిర్వహించడానికి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. పోలీసుల సాక్షిగా పందెంరాయుళ్లు పేట్రేగిపోనున్నారు. పందాలతో పాటు పేకాట పోటీలు, గుండాట, రికార్డింగు డ్యాన్సుల వంటివి నిర్వహించే యోచనలో కొన్ని ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు ఉన్నారు. అధికార వైసీపీకి చెందిన కీలక ప్రజాప్రతినిధుల సంపూర్ణ సహకారంతో పండుగ మూడు రోజులు జూద క్రీడలు నిర్వహించడానికి ఆ పార్టీ కేడర్ రంగం సిద్ధం చేసుకుంటుంది.

-(అమలాపురం-ఆంధ్రజ్యోతి)



ఆత్రేయపురం మండలంలో ఓ బరి వద్ద ఏర్పాట్లు

పందాలకు సైసై

ఆత్రేయపురం, జనవరి 13: బొబ్బర్లంక, పేరవరం, వసంతవాడ, తాడిపూడి, లొల్ల, ర్యాలి తదితర ప్రాంతాల్లో మొత్తం తొమ్మిది బరులు ఏర్పాటు చేశారు. వేల కోళ్లు బరులలో తలపడనున్నాయి. ఇప్పటికే స్థావరాలలో పందెం పుంజులను రెడీ చేస్తున్నారు. ఆయా శిబిరాల వద్ద గుండాట, పేకాట, బెల్టుషాపులు, బిరియానీ షాపులను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు వేలం పాటలు నిర్వహించారు. బరులు సిద్ధం చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అలాగే వివిధ గ్రామాల్లోని జాతరలో రికార్డింగ్ డ్యాన్సులు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీ నేతల అండదండలతో సంక్రాంతి మూడు రోజులు అసాంఘిక కార్యకలపాలు విచ్చలవిడిగా జరగనున్నాయి.

కోడి పందాలకు రంగం సిద్ధం

ఐ.పోలవరం, జనవరి 13: మండలంలో సంక్రాంతికి కోడి పందాలు, గుండాటలు నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నప్పటికీ నిర్వాహకులు మాత్రం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కేశనకుర్రుపాలెం, గుత్తెనదీవి, కొమరగిరి, ఎదురులంక, పాత ఇంజరంలలో ఏర్పాట్లు సాగుతున్నాయి.

బరి తెగించారు

అమలాపురం పట్టణంలోని ప్రధాన రహదారులను ఆనుకుని కామనగరువు జాతీయ రహదారి వెంట కీలక బరి ఏర్పాటు చేస్తున్నారు. ఇందుపల్లిలోను బరి ఏర్పాటుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. మరికొన్ని చోట్ల బరులు ఏర్పాటు చేసేందుకు రాజకీయ సిఫారసులతో కొందరు సిద్ధమవుతున్నారు. అదే విధంగా మురమళ్ల, ఎదుర్లంక, కేశనకుర్రు, కొమరగిరి, గుత్తెనదీవి, ముమ్మిడివరం మండలంలో రాజుపాలెం, క్రాపచింతలపూడి, కొత్తలంకలతో పాటు అమలాపురం రూరల్ మండలం సమనస, సాకుర్రు, ఇందుపల్లి, అల్లవరం మండలంలో గోడి, గోడిలంక, అల్లవరం, గుండెపూడి గ్రామాల్లోను, ఉప్పలగుప్తం మండలంలో చల్లపల్లి, ఎస్.యానాం, ఎన్.కొత్తపల్లి, గొల్లవిల్లి పరిసరప్రాంతాల్లోను, అయినవిల్లి మండలం చింతనలంక, నేదునూరు, అయినవిల్లి, అయినవిల్లిలంక పరిసర గ్రామాల్లోను ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంక, వద్దిపర్రు, వెలిచేరుతో సహా అనేక గ్రామాల్లో రహదారి చెంతనే పందెం బరులను సిద్ధం చేసుకుంటున్నారు. ఇక మామిడికుదురు, అంబాజీపేట, గన్నవరంలతోపాటు సఖినేటిపల్లి మండలం గుడిమూల, రామేశ్వరం, ఉయ్యూరివారిమెరక, సఖినేటిపల్లిలంక, మలికిపురం మండలం కేశనపల్లి, తూర్పుపాలెం ఇలా అనేక గ్రామాల్లో కోడిపందాల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో అధికార వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా శాంతి భద్రతలు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు.



గెద్దనపల్లి బరి వద్ద పోలీసుల హెచ్చరికలు

- పోలీసుల హెచ్చరికలు బేఖాతరు
- భారీగా కోడిపందాలు, గుండాటలకు ఏర్పాట్లు
- గెద్దనపల్లిలో బరి ఏర్పాట్లను అడ్డుకున్న పోలీసులు
- జిల్లా వ్యాప్తంగా 50 ప్రాంతాల్లో కీలక బరులు
- ప్రభల తీర్థాల ముసుగులో రికార్డింగ్ డ్యాన్సులు



ముమ్మిడివరం మండలం అన్నంపల్లిలో బరి సిద్ధం చేస్తున్న దృశ్యం

ఫ్లడ్‌లైట్ల వెలుగులో

ముఖ్యంగా కోనసీమలోని గెద్దనపల్లి, చెయ్యేరు, గోడి, కామనగరువు, ఇందుపల్లి, వియ్యూరివారి మెరక, లక్కవరం, గోగన్నమఠం, పెదపట్నంలంక ఇలా జిల్లా వ్యాప్తంగా 50కు పైగా ప్రదేశాల్లో కీలక బరులు ఏర్పాటు చేస్తున్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందెం బరులు సిద్ధమవుతున్నాయి. వీఐపీ గ్యాలరీలతో పాటు సందర్శకుల గ్యాలరీలను కొన్నిచోట్ల సిద్ధం చేస్తున్నారు. అధికార వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులతో తొలి పందాలను అట్టహాసంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. సంపూర్ణ సహకారం అందిస్తున్న అధికార యంత్రాంగానికి భారీ నజరానాలను నిర్వాహకులు ప్రకటించారు. పోలీసుల సాక్షిగా రాజకీయ పార్టీలకు అతీతంగా కీలక నేతలు ఈ కోడి పందాలకు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాట్రేనికోన మండలం గెద్దనపల్లి గ్రామంలో కోడిపందాల ఏర్పాట్లను ముమ్మిడివరం సీఐ కొండయ్య, ఎస్ఐ నాగేశ్వరరావు స్థానిక పోలీసులు శనివారం వెళ్లి పరిశీలించారు. టెంట్లను తొలగించాలని నిర్వాహకులకు సూచించారు. వేస్తున్న టెంట్లను కూడా తీసివేయించారు. అయినప్పటికీ ఆ ప్రాంతంలో కోడిపందాల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. కోడి పందేలు, గుండాటలు నిర్వహించకూడదని పోలీసులు ఓ వైపు హెచ్చరికలు జారీ చేస్తున్నా నిర్వాహకులు అవేమీ పట్టించుకోవడం లేదు.



అనుమతులు లేకున్నా..

గురువారం కోనసీమ వ్యాప్తంగా పలుచోట్ల భారీగాను, మరికొన్నిచోట్ల ఓ మోస్తరుగాను కురిసిన వర్షం కోడిపందేల నిర్వాహకులకు కొంచెం ఇబ్బందికరంగా మారింది. కొన్నిచోట్ల ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో నిర్వాహకులు సంప్రదింపులు జరుపుకుని అనుమతులు తీసుకుంటున్నారు. గుండాట బోర్డులు ఏర్పాటుకు పోలీసు యంత్రాంగం ససేమిరా అంటున్నప్పటికీ ఎవరి సన్నాహాల్లో వారు ఉన్నారు. ఇక ప్రభల తీర్థం ముసుగులో కొత్తపేటతో సహా ఇతర గ్రామీణ ప్రాంతాల్లో రికార్డింగ్ డ్యాన్సుల నిర్వహణకు రంగం సిద్ధమవుతున్నట్టు తెలిసింది. అయితే పోలీసులు కోడి పందాల విషయంలో చూసీచూడనట్టు వ్యవహరించే అవకాశం ఉన్నప్పటికీ అశ్లీల నృత్యాలను మాత్రం కచ్చితంగా అడ్డుకునే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. అయితే చాలా ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు పందేల నిర్వహణపై స్థానికులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రజల సాంప్రదాయ పద్ధతుల ద్వారా పండుగలు జరుపుకోవాల్సిందిగా పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఇప్పటికే పందెంరాయుళ్లకు హెచ్చరికలు జారీ చేశారు.

పలు గ్రామాల్లో సిద్ధమైన బరులు

మామిడికుదురు, జనవరి 13: సంక్రాంతి వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందాలు నిర్వహించడానికి నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. గోగన్నమఠం, మగటపల్లి, మాకనపాలెం, ఆదుర్రు, అప్పనపల్లి, పాశర్లపూడి తదితర గ్రామాల్లో బరులు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం వరకు పోలీసులు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసినప్పటికీ నిర్వాహకులు షరామామూలుగా బరులు సిద్ధం చేస్తున్నారు. బరులతో పాటు గుండాటలు, అశ్లీల నృత్యాలు ఏర్పాటుకు కూడా సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. సంక్రాంతి బరిలో పోలీసులది పైచేయా లేక పందెం రాయుళ్లదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మరోవైపు ఎలాగైనా పందాలను నిలుపుదల చేయాలని పోలీసులు పట్టుదలతో ఉన్నారు.

కోడి పందాలకు రెఢీ

ముమ్మిడివరం, జనవరి 13: సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందాలు, గుండాటలను నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. సంప్రదాయ పద్ధతిలోనే పండుగ జరుపుకోవాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా నిర్వాహకులు మాత్రం వాటిని బేఖాతరు చేస్తూ పండుగ మూడు రోజులు కోడిపందాలు, గుండాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగిస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడడంతో అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సంక్రాంతికి కోడిపందాలు నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో భోగి పండుగ రోజు నుంచి కనుమ పండుగ వరకు మూడు రోజులు కోడిపందాల నిర్వహణకు సంబంధించి మంతనాలు సాగుతున్నాయి. మండలంలో రాజుపాలెం, పల్లిపాలెం, అన్నంపల్లి, కొత్తలంక, అయినాపురం, గేదెల్లంక గ్రామాల్లో కోడిపందాలు, గుండాటల నిర్వహణకు ఇప్పటికే బరులు ఏర్పాటు చేసే పనిలో నిర్వాహకులు ఉన్నారు. రాత్రి సమయాల్లో ట్రాక్టర్లతో బరులను సిద్ధం చేస్తున్నారు. పండుగ మూడు రోజులు రాత్రుళ్లు కూడా కోడి పందాల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు సాగుతున్నాయి. వీటి నిర్వహణకు బరికి ఇంతని లోపాయికారిగా పాటలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఇవన్నీ అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయి. ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ఎన్.కొండయ్య, ఎస్.శివప్రసాద్, తహసీల్దార్ విజయశ్రీలు గత ఏడాది ఏయే గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించారో అక్కడకు వెళ్లి గ్రామసభలు నిర్వహించి కోడిపందాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే ఇదంతా షరామామూలేనని నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

నేడు గోదారంగనాథుల కల్యాణం

- వాడపల్లి వెంకన్న ఆలయంలో ఘనంగా ఏర్పాట్లు
- ఆన్‌లైన్‌లో టిక్కెట్ పొందిన 1250 మంది..
- పుష్పాలంకరణలో స్వామి వారి ఆలయం



కల్యాణోత్సవం జరిగే శ్రీనివాస ప్రాంగణంలో ఏర్పాట్లు

ఆత్రేయపురం, జనవరి 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి పండుగతో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ముగియనున్నాయి. భోగి ఆదివారం శ్రీనివాస ప్రాంగణంలో గోదారంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. పెళ్లికాని యువతి, యువకులు గోదాదేవి కల్యాణంలో పాల్గొంటే తప్పక ఫలితం దక్కుతుందని భక్తుల విశ్వాసం. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1250 మంది పెళ్లి కాని యువతీయువకులు ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొంది కల్యాణోత్సవంలో పాల్గొననున్నారు. శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో ముస్తాబు చేశారు. భారీ స్థాయిలో భక్తులు కల్యాణాన్ని నిర్వహించుకోవడంతో పాటు కనులారా వీక్షించేందుకు భారీ షెడ్లను ఏర్పాటు చేశారు. అలాగే సంక్రాంతి పండుగకు పురస్కరించుకుని స్వామివారి ఆలయాన్ని ఫలపుష్పాలతో అలంకరించారు. 1500 అడుగుల భోగి పిడకల దండను ఆలయం వద్ద భోగి మంటలో వేయనున్నారు. గోదారంగనాథుల కల్యాణం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు తెలిపారు.



కల్యాణ వేదికను అందంగా తీర్చిదిద్దుతున్న దృశ్యం

కుర్చీలు లేని పదవులు బీసీలకా?

బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారు
మాజీ ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్/రూరల్, జనవరి 13: బీసీలకు కుర్చీలు లేని చైర్మన్ పదవులు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బీసీలను అణగదొక్కిన పార్టీగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గత టీడీపీ హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. నిధులు, విధులు లేని కార్పొరేషన్లు ఎందుకని ఆయన ప్రశ్నించారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం నియోజకవర్గ కార్యాలయంలో జయహో బీసీ సమావేశం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం తీసుకు వస్తుందని ప్రకటించారు. సమావేశంలో తాళాబత్తుల అప్పలాచార్యులు, కడలి వెంకటేశ్వరరావు, గుత్తుల నాగేశ్వరరావు, బాస్కర్ల రామకృష్ణ, వాసంశెట్టి జగదీష్, పలివెల శ్రీను, అనుపోజు శ్రీను, కుడుపూడి వెంకటేశ్వరరావు, కాశిన జయనాథ్, పట్నాల రమణ, ఆవుపాటి గోపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

20న మండపేటలో సభ

ఈ నెల 20న మండపేటలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగే రా.. కదలిరా.. బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఇందుపల్లిలో టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఆనందరావు అధ్యక్షతన నిర్వహించారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జన సమీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణమరాజు, మల్లుల పోలయ్య, పెచ్చెట్టి చంద్రమౌళి, పిచ్చిక శ్యామ్, చొల్లంగి సత్యసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలన గాడి తప్పింది

మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి

మండపేట, జనవరి 13: వైసీపీ హయాంలో రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సీఎం జగన్ ప్రజలపై మోయలేని పన్నుల భారం వేశారన్నారు. మండపేట టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 20న మండపేట ఆలమూరు రోడ్డులో ఉన్న లేఅవుట్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగే రా కదలిరా సభకు భారీగా ప్రజా స్పందన వస్తోందన్నారు. కోనసీమ జిల్లాలోని 7 నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన శ్రేణులు హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లా డుతూ ఈ ప్రభుత్వంలో ఇసుక, గ్రావెల్, దోపిడీకి అంతు లేకుండా పోయిందని ఆరోపించారు. టీడీపీ జనసేన సంయుక్తంగా మండపేటలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. నల్లమిల్లి వీర్రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు వరప్రకాష్, మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెం జంక్షన్‌లో వాహనాల రద్దీ

పండుగ రద్దీ

రావులపాలెం, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలతో జాతీయ రహదారిపై రద్దీ పెరిగింది. శనివారం ఉదయం నుంచి రావులపాలెం జాతీయ రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కళా వెంకట్రావు సెంటర్ వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నప్పటికి ఒక్కో సమయంలో వాహనదారులు ఇష్టానుసారంగా వచ్చేయడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనదారుల సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.



రావులపాలెంలో ట్రాఫిక్ జామ్



హోరాహోరీగా.. బాస్కెట్‌బాల్ పోటీలు

సత్తా చాటిన వివిధ జిల్లాల జట్లు

6లో



సత్యదేవుడి దర్శనానంతరం సమాచార కమిషనర్

సత్యదేవుడి సన్నిధిలో సమాచార కమిషనర్ పూజలు

అన్నవరం, జనవరి 13: సత్యదేవుడి సన్నిధిలో శనివారం సమాచార హక్కుచట్టం కమిషనర్ కె.చెన్నారెడ్డి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ పీఆర్వో దామెర కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

గోవిందనామస్మరణతో మార్మోగిన వెంకన్న ఆలయం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, జనవరి 13: అశేషభక్తజన గోవిందనామస్మరణ నడుమ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులతో మార్మోగింది. శనివారం వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల ఫలపుష్పాలతో స్వామివారి ఆలయాన్ని అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, తలనీలాలు, కానుకులు సమర్పించారు. అశేషభక్తజనం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.29.36 లక్షలు లభించినట్టు ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



వాడపల్లి స్వామివారిని దర్శించుకుంటున్న ఇంటెలిజెన్స్ చీఫ్ అజాద్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



పెద్దాపురం, జనవరి 13: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారి దర్శనానికి భక్తులు తెల్లవారు జాము నుంచే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,19,360 అన్నదాన విరాళాలు రూ.47,122 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.4,240 వెరసి రూ.1,70,722 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పులి నారాయణమూర్తి తెలిపారు. సుమారు 6వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

రఘురామకృష్ణంరాజుకు ఘనస్వాగతం



రావులపాలెం కళావెంకట్రావు సెంటర్‌లో ఎంపీ రఘురామకృష్ణంరాజును గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

రావులపాలెం, జనవరి 13: రావులపాలెంలో నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. నాలుగు సంవత్సరాల తర్వాత స్వగ్రామం వెళుతున్న ఆయన శనివారం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో విమానం దిగి రోడ్డుమార్గం గుండా బయలుదేరారు. దీంతో రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌కు చేరుకున్న ఆయ నకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, టీడీపీ యువనాయకుడు బండారు సంజీవ్‌తో పాటు టీడీపీ, జనసేన నాయకులు చేరుకుని గజమాలతో సత్కరించారు. ఇందులో భాగంగా సతీష్‌రాజు రఘురామకృష్ణంరాజుకు సంక్రాంతి సందర్భంగా కోడిపుంజును అందించారు.

కాపులకు 75 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

● కాపునాడు జాతీయ అధ్యక్షుడు రమేష్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కాపునాడు జాతీయ అధ్యక్షుడు రమేష్ నాయుడు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో కాపులకు 75 అసెంబ్లీ స్థానాలు, 8 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని కాపునాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తాడివాక రమేష్‌నాయుడు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల జనాభా దామాషా 27 శాతం ప్రకారం అన్ని రాజకీయపార్టీలు సీట్లు కేటాయించాలని, నామినేటెడ్ పోస్టులతో పాటు అన్నిరంగాల్లో ప్రాతినిధ్యం కల్పించే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. రాజ్యాధికారంలో వాటా పొందడంతో పాటు రెండేళ్ల పవర్ షేరింగ్ విధానంలో ముఖ్యమంత్రి పదవి చేపట్టి తీరాలని డిమాండ్ చేశారు. కాపునాడు రాష్ట్ర కన్వీనర్ సిద్దా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ ఎవ్వరితో పొత్తుపెట్టుకున్నా అభ్యంతరంలేదుకానీ అంతి మంగా ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 6 అసెంబ్లీ స్థానాలు, 1 ఎంపీ స్థానాన్ని, ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలో 7 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాన్ని, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఒక్కొక్క పార్లమెంట్, 5 అసెంబ్లీ స్థానాలు, రాయలసీమలో 5 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాన్ని కాపులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే కాపునాడు పొలిటికల్ ఫ్రంట్ ఏర్పాటుచేసి తిరుపతి కేంద్రంగా కార్యాచరణ చేసేందుకు చర్చలు ప్రారంభిస్తున్నామన్నారు. సమావేశంలో కాపునాడు నాయకులు పెదిరెడ్డి మహేష్, వంగా ఆంజనేయులు, నల్లమిల్లి సత్యనారాయణ, వి.శ్రీదేవి, గంటా దివాకర్, జేటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత దుర్గేష్‌కు సతీవియోగం

● పలువురు నేతల సంతాపం



కందుల ఉషారాణి (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల లక్ష్మీదుర్గేష్‌కు సతీవియోగం సంభవించింది. ఆయన భార్య కందుల ఉషారాణి(53) కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతిచెందారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉషారాణి భౌతికకాయం రాత్రి రాజమహేంద్రవరం చేరుకుంది. ఆదివారం ఉదయం 10గంటలకు ఇన్నీసుపేట కైలాసభూమిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం ఉదయమే దుర్గేష్‌కు ఫోనుచేసి పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, టీడీపీ నాయకులు గన్నికృష్ణ, ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావులు ఉషారాణి మృతి పట్ల సంతాపం తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసం

● నాయకుల పేర్లపై వివాదం ● ఆవిష్కరణ సమయంలోనే శిలాఫలకం మాయం



అనపర్తిలో వివాదాస్పదంగా మారిన అంబేడ్కర్, పూలే విగ్రహాల ప్రాంగణం, విగ్రహ శిలాఫలకం ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ శివగణేష్

అనపర్తి జనవరి 13: అనపర్తి కెనాల్ రోడ్డులో ఇటీవల ప్రారంభమైన బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాల శిలాఫలకాలు వివాదాస్పదంగా మారాయి. శుక్రవారంరాత్రి దుండగులు అంబేడ్కర్ విగ్రహానికి ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గత నెల 30న అంబేడ్కర్, పూలే విగ్రహాల ప్రారంభోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేసి పూలే విగ్రహానికి ప్రారంభకులు ఎంపీ భరత్‌రామ్, శిలాఫలక ఆవిష్కరణ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పేర్లను, అంబేడ్కర్ విగ్రహానికి ప్రారంభకులు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, శిలాఫలకం ఆవిష్కరణ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్లను ఏర్పాటు చేశారు. అయితే ప్రారంభోత్సవం ముందురోజు రాత్రి అంబేడ్కర్ విగ్రహంవద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకం మాయమైంది. మాజీ ఎమ్మెల్యే పేరు ఉన్నందునే దానిని మాయం చేశారని ఒక వర్గం ఆరోపించింది. దీంతో శిలాఫలకం ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటుచేసి ప్రారంభోత్సవం పూర్తిచేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి శిలాఫలకం ఏర్పాటుచేశారు. అయితే దానిని శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేయడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సీఐ శివగణేష్, ఎస్‌ఐ రామారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి శిలాఫలకం ధ్వంసమైన ప్రాంతం లో ప్లాస్టిక్ కవర్‌ను కప్పించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ పికెట్‌ను ఏర్పాటుచేశారు. కాగా శిలాఫలకం ధ్వంసంపై నల్లా చిన్నారావు, పచ్చిమళ్ల వెంకటరమణ విడివిడిగా ఫిర్యాదులు చేశారని, కోర్టు అనుమతితో కేసులు నమోదు చేస్తామని సీఐ చెప్పారు.

జోనల్‌స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల విన్నర్‌గా జగన్



జోనల్‌స్థాయి బాడీబిల్డింగ్ విజేతగా నిలిచిన కోనసీమ జిల్లాకు చెందిన జగన్



బాడీబిల్డింగ్ పోటీల విజేతలకు షీల్డులు అందజేసిన డీఎస్పీ అంబికాప్రసాద్

అమలాపురంటౌన్, జనవరి13: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో గోదావరి జోనల్‌స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం అర్ధరాత్రి వరకు నిర్వహించారు. ఆయా పోటీల విజేతల వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు శనివారం ప్రకటించారు. కోనసీమ జిల్లాకు చెందిన ఎం.జగన్ టైటిల్ విన్నర్‌గాను, కాకినాడ జిల్లాకు చెందిన టి.ప్రశాంత్ రన్నర్‌గాను నిలిచారు. కాకినాడజిల్లా టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గాను, కోనసీమజిల్లా రన్నర్‌గాను నిలిచిం దన్నారు. బహుమతి ప్రదానోత్సవ సభకు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 160 మంది బాడీబిల్డర్లు 12 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నట్టు అసోసియేషన్ కార్యదర్శి కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. 55కిలోల విభా గంలో కె.ప్రసాద్(కాకినాడ), 60 కిలోల విభాగంలో ఎం.జగన్ (కోనసీమ), 65కిలోల విభాగంలో కె.సిద్దు(కాకినాడ), 70కిలోల విభాగంలో ఎన్.రోహిత్(కోనసీమ), 75కిలోల విభాగంలో టి.ప్రశాంత్ (కాకినాడ), 75కిలోల పైబడిన విభాగంలో డి.శ్రీను (కాకినాడ)లు విజేతలుగా నిలిచారు. మాస్టర్స్ విభాగంలో టి.అబ్బులు(కోనసీమ), దివ్యాంగ విభాగంలో జి.మోషే(ఏలూరు), ఫిజిక్ స్పోర్ట్స్ 165 సెంటీమీటర్ల బిలో కేటగిరిలో కె.సాయిగణేష్ (పశ్చిమగోదావరి), 165 సెంటీమీటర్ల పైబడిన విభాగంలో సీహెచ్ ఇళయరాజా(కాకినాడ)లు ప్రథమస్థానాలు సాధించారు. వారికి డీఎస్పీతోపాటు జనసేన పార్లమెంటు ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, ఆఫీసర్స్ క్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్, పవన్‌లిఫ్టింగ్ జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, జంప న సుమన్‌వర్మ, లింగోలు పండులతోపాటు అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ విజేత పిల్లి వందనలు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

చదువులమ్మ చెట్టు నీడన..

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మోరి హైస్కూలులో కలిసిన 1979-84 పూర్వ విద్యార్థులు

అంతర్వేది, జనవరి 13: నాలుగు దశాబ్దాల క్రితం సరస్వతీ నిలయ మైన ఆ చదువులమ్మ చెట్టు నీడన చదువుకున్న పూర్వ విద్యార్థులంతా అదే పాఠశాలలో మరోసారి కలుసుకుని ఆనంద పరవశులయ్యారు. సఖినేటిపల్లి మండలం మోరి జానసుబ్బమ్మ మెమోరియల్ జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో 1979-84లో 6 నుంచి పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డా తిరిగి అదే చదువులమ్మ ఒడిలో బుద్ధిగా ఒదిగిపోయారు. అలనాటి మధుర స్మృతులను తలుచు కుని విద్యార్థులుగా మారిపోయి సందడి చేశారు. అలనాటి తరగతి గదుల్లో తిరుగుతూ సందడి చేశారు. తొలుత అలనాటి విద్యార్థులు కామిశెట్టి మాచరమ్మ, పడవల కోట సూర్యకు మారి, నిమ్మగడ్డ ఝాన్సీ, గుత్తి సుబ్బలక్ష్మి, సరెళ్ల పద్మ, భాగ్యలక్ష్మి తదితరులు జ్యోతి ప్రజ్వలనచేసి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు డాక్టర్ ఆకుల వెంకట రామ్మోహనరావు అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థుల పరిచయం అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కోలాటం ఆడారు. సంక్రాంతి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ ప్రతినిధులు రాపాక పెద్దిరాజు, ఉప్పుగంటి నాగమల్లేశ్వరరావు, శ్రీపాద వెంకటేశ్వర్లు, పసలపూడి శ్రీనివాసరావు, గానాల వెంకటా చార్యులు, బళ్ల మహాత్మాగాంధీ, కాశిన సూరన్న పాల్గొన్నారు. కుమార్తె వర్షితతో కలిసి తండ్రి శ్రీపాద వెంక టేశ్వర్లు చేసిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. జంటకవులు పసలపూడి శ్రీనివాసరావు, గోళ్ల ప్రకాష్‌లను సత్కరించారు. నిర్వాహకులతో పాటు విదేశాల నుంచి వచ్చిన మేకలలక్ష్మి, గెడ్డం రాజబాబు, నల్లి జనార్ధనరావులను సత్కరించారు.

మకరదర్శనం కోసం ద్వారపూడి అయ్యప్ప ఆలయం ముస్తాబు

● గురుస్వామి ఎస్ఎల్ కనకరాజు



మండపేట, జనవరి 13: ఆంధ్ర శబరిమలైగా పిలువబడే ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం కోసం ఏర్పాట్లను చేస్తున్నామని ఆలయ ట్రస్టీ ఎస్.ఎల్. కనకరాజు గురుస్వామి వెల్లడించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం ద్వారపూడి అయ్యప్పస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15న సోమవారం ఉదయం 4.30నుంచి ప్రారంభమయ్యే మహాగణప తిహోమం, 6గంటలకు స్వామివారికి ఇరుముడి అభిషేకం, 8.30కు స్వామివారి రథం, స్వామివారి ఆభరణాల పెట్టెను రాయవరం మండలం మాచవరానికి చెందిన కర్రి ఆదిరెడ్డి శిరస్సుపై ఉంచి గ్రామంలో గ్రామోత్సవం ఊరేగింపు, జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం 4గంటలకు, ఆలయ ప్రాంగణంలో ఉన్న దేవతామూర్తులు విగ్రహాలకు ఆభరణాలు విశేష పూజలు, పుష్పాలంకరణ, జరుగు తాయన్నారు. సాయంత్రం ఆలయంవద్ద కొమరిపాలెం వారిచే భారీగా బాణాసంచా కాలుస్తారన్నారు. అనంతరం సాయంత్రం 6.30కు మకరజ్యోతి(కర్పూరనీరాజనం) మంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని గురుస్వామి కనకరాజు భక్తులకు పిలుపునిచ్చారు.

ధర్మమంటే ఒక మతం కాదు..

● పరిపూర్ణానందసరస్వతి స్వామిజీ



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందసరస్వతి స్వామిజీ, చిత్రంలో రాంమాధవ్

అమలాపురం రూరల్, జనవరి 13: భారతీయ సనాతన ధర్మం విశ్వ వ్యాప్తమని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతిస్వామిజీ పేర్కొన్నారు. ధర్మమంటే ఒక మతంకాదని గుర్తించాలన్నారు. ఈదరపల్లిలో సేవాభారతి, రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో నిర్మించిన జనహిత కార్యాలయం అదనపు భవనాన్ని శనివారం ఆర్‌ఎస్ఎస్ అఖిలభారత కార్యకారిణి సదస్యులు వారణాసి రాంమాధవ్‌తో కలిసి స్వామిజీ ప్రారంభించారు. సేవాభారతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా తొలుత ముఖ్యఅతిథులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామిజీ గోపూజ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యవక్తగా సహక్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ హాజరై ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. ముఖ్య అతిథులు రాంమాధవ్ మాట్లాడుతూ అయోధ్యలో ఈనెల 22న రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠతో భారతీయుల్లో స్థిరప్రతిష్ఠ జరుగుతుందన్నారు. పరిపూర్ణానంద సరస్వతిస్వామి మాట్లాడుతూ సేవా భారతి, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన అమలాపురంలో జనహిత కార్యాలయాన్ని నిర్మించడం అద్భుతమన్నారు. మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) తనవంతుగా ఆర్థిక సాయాన్ని ప్రకటించి జనహిత ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల ను ప్రశంసించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సంపర్క్ బులుసు జగదీష్, రాష్ట్ర అధ్యక్షుడు సుంకవిల్లి రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర, విభాగ్ ప్రము ఖులు డాక్టర్ గోదశి గంగరాజు, శ్రీరామచంద్రరాజు, ఓలేటి సత్యనారాయణ, సోమశేఖర్, జీవీఎస్ కామేశ్వరరావు, వాసంశెట్టి బలరా మకృష్ణ, అమ్మిరాజుతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం, జనవరి 13: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న 13వ ఆలిండియా 19వ ఆంధ్రప్రదేశ్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ పోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్, రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఓపెన్ కేటగిరీలో నిర్వహిస్తున్న ఈ పోటీలను లీగ్, నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. పురుషుల విభాగంలో రామచంద్రపురం ఎ జట్టు ఖమ్మంజట్టుపై 75-47 పాయింట్‌లతోనూ హైదరాబాద్ డిఫెన్స్ జట్టు, కాకినాడ డీఎస్ఏ జట్టుపై 41-10, ఆట్లేరీ జట్టు సామర్లకోటపై 45-22, డీబీఏ జట్టు హైదరాబాద్ జట్టు జి.మామిడాడపై 55-48 కమర్షియల్ టాక్స్ అండ్ ఎక్సైజ్ జట్టు ఏపీఎస్పీ కాకినాడ జట్టుపై 60-42, డీఎస్ఏ కాకినాడ జట్టు హైదరాబాద్ సెయింట్‌పై 53-42 రాజమండ్రి సీబీఏ జట్టు రామచంద్రపురం బి జట్టుపై 44-23, అనంతపురం జట్టు సామర్లకోట జట్టుపై 32-20, గుంటూరు జట్టు ఏపీఎస్పీ కాకినాడ జట్టుపై 55-47 పాయింట్లతో గెలుపొందినట్లు రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. మహిళల విభాగంలో చత్తీస్‌గడ్ జట్టు మేరీ స్టెల్లా జట్టుపై 42-10, డిఫెన్స్ హైదారాబాద్ జట్టు కాకినాడ డీఎస్ఏ జట్టుపై పై 41-10 విజయవాడ సీబీఏ జట్టు అమలాపురంపై 26-10, రామచంద్రపురం జట్టు అమలాపురంపై 45-7, డీబీఏ హైదరాబాద్ జట్టు విజయవాడ స్టెల్లా జట్టుపై 31-8, ఏలూరుజట్టు కాకినాడ డీఎస్ఏ జట్టుపై 29-4 పాయింట్లతో గెలుపొందినట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గన్నమని తెలిపారు. బాస్కెట్ బాల్ రామచంద్రపురం అధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, జె.దుర్గాప్రసాద్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల బాలుడి మృతి

● అపస్మారక స్థితిలో భార్య
● భర్త, మరో కుమారుడికి తీవ్ర గాయాలు



గొల్లప్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌ను ఢీకొట్టిన కారు

గొల్లప్రోలు, జనవరి 13: కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రెండేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య అపస్మారక స్థితిలో చేరుకోగా, మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన తీరు చూపరులను కన్నీరు పెట్టించింది. రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి చెందిన సీహెచ్.వెంకటరమణ తన సతీమణి గౌతమి, కుమారులు దుర్గాప్రసాద్, శ్రీచైతన్యలతో కలిసి శనివారం అన్నవరం వెళ్లారు. సత్యదేవుని దర్శనం అనంతరం అక్కడే భోజనంచేసి మోటార్‌సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. కోటనందూరు మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన వ్యక్తులు కారులో వెళ్తూ గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో పెట్రోల్‌బంకు జంక్షన్ వద్ద వెనుక నుంచి మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో రెండేళ్ల శ్రీచైతన్య అక్కడికక్కడే మరణించాడు. గౌతమి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంకటరమణ, బాలుడు దుర్గాప్రసాద్‌లకు తీవ్రగాయాలయ్యాయి. తన తమ్ముడు శ్రీచైతన్య చనిపోవడం, తల్లి గౌతమి చలనం లేకుండా పడి ఉండటంతో దుర్గాప్రసాద్ విలపిస్తున్న తీరు అందరికంట కన్నీరు తెప్పించింది. వెంకటరమణ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంటుగా పనిచేస్తున్నారు. గాయపడిన వారిని హైవే మొబైల్ సిబ్బంది తొలుత పిఠాపురం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో అపస్మారకస్థితిలో ఉన్న భార్య, తీవ్రంగా గాయపడ్డ, భర్త, కుమారుడు

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

అంతర్వేది, జనవరి 13: అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో బడుగు మంగాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ మాట్లాడారు. సర్పంచ్‌లు రేపూరి రాజేశ్వరిఏసు, నల్లి లీలావతి, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, ఏపీవో నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్దాం



మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

రావులపాలెం, జనవరి 13: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను మూకుమ్మడిగా ప్రజల్లోకి తీసుకువెళ్దామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం కాపు కల్యాణ మండపంలో శనివారం టీడీపీ జనసేన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. సత్యానందరావు మాట్లాడుతూవైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను, జగ్గిరెడ్డి అవినీతిని టీడీపీ, జనసేన కలిసి ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కొత్తపేటను పులివెందుల చేస్తానని చెప్పిన జగ్గిరెడ్డి తనఅనుచరులతో రౌడీయుజం చేయించి పులివెందుల సంస్కృతి తీసుకువచ్చారని ఆరోపించారు. ఈనెల20న మండపేటలో జరగబోయే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్వ హించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ శ్రేణులతో కలిసి చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, నియోజకవర్గ పరిశీలకుడు వాసిరెడ్డి రాంబాబు, చంద్రబాబు సభ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, టీడీపీ, జనసేన మండలనాయకులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలిచి అంగన్‌వాడీల నిరసన



ముమ్మిడివరం: మోకాళ్లపై నిలిచి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ముమ్మిడివరం, జనవరి 13: అంగన్‌వాడీల సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సీడీపీవో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిలుచుని 33అంకె రూపంలో నిరసన తెలిపారు. సంక్రాంతి పండుగ రోజు కూడా అంగన్‌వాడీలను రోడ్డుపైనే పడవేసి నిరంకుశ ధోరణిగా వ్యవహరిస్తుందన్నారు. సమస్యను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని ప్రాజెక్టు అధ్యక్షురాలు దుర్గామహేశ్వరి, కార్యదర్శి ఎం.జయలక్ష్మిలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జి.మంగాయమ్మ, విజయకుమారి, జి.శ్రీదేవి, ఎ.ధనలక్ష్మి, విజయ, యశోద, జి.అనంతలక్ష్మి, సత్యవతి, సుబ్బలక్ష్మి, వి.తలుపులమ్మ పాల్గొన్నారు.

మండపేట: అంగన్‌వాడీల సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరింది.విధుల్లో చేరకుంటే తొలగిస్తామని చేసే బెదిరింపులకు లొంగబోమని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పండుగపూట కూడా పస్తులేనా అంటూ ప్రభుత్వ తీరుకు నిరసనగా అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు.

నేడు దీక్షా శిబిరాల వద్దే భోగిమంటలు

అమలాపురం టౌన్, జనవరి 13: అంగన్‌వాడీల నిరవధిక సమ్మె శనివారానికి 33వరోజుకు చేరుకుంది. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు 24గంటల నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ సంఘం జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బెదిరింపు ధోరణిలోనే ప్రభుత్వం వ్యవహరిస్తోంది తప్ప అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోవడంలేదని అందుకే జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు కొనసాగిస్తున్న సమ్మె శిబిరాల వద్దే ఆదివారం భోగి మంటలువేసి నిరసన తెలియజేయనున్నట్లు చెప్పారు. దీక్షలో పి.గన్నవరం ప్రాజెక్టు పరిధిలోని మామిడికుదురు అంగన్‌వాడీలు పాల్గొనగా ప్రాజెక్టు కోశాధికారి పి.అమూల్య, కార్యదర్శి కె.బేబిగంగారత్నం ప్రారంభించారు. వివిధ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపి ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

ఆత్రేయపురంలో సంక్రాంతి పడవ పోటీలు



ఆత్రేయపురం, జనవరి13: సంక్రాంతిసంబరాల్లో భాగంగా కేరళ తరహాలో సంక్రాంతి మూడు రోజులు ఆత్రేయపురం గ్రామంలోని ప్రధాన పంటకాలువలో పడవ పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పోటీలను ప్రారంభించారు. పడవ, ఈత తదితర పోటీలను బొబ్బర్లంక- ఆత్రేయపురం ప్రధాన పంటకాలువలో నిర్వహిస్తున్నారు. ఈపోటీలను నిర్వహిస్తున్న వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కప్పల శ్రీధర్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి ప్రకాష్‌లను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండా అన్నపూర్ణ, ముదునూరి రామరాజు, కనుమూరి శ్రీనివాసరాజు, గాదిరాజు రామకృష్ణంరాజు, బి.సురేష్ రాజు, కొల్లి శ్యామ్‌సన్, కప్పల శ్రీధర్ పాల్గొన్నారు.

'జగన్‌కు యావజ్జీవ శిక్ష తప్పదు'

మామిడికుదురు, జనవరి 13: అక్రమార్కుల కేసులో సీఎం జగన్‌కు యావజ్జీవ శిక్ష తప్పదని టీడీపీ రాష్ట్ర నాయకుడు నామన రాంబాబు పేర్కొ న్నారు. తీవ్ర నేరారోపణలకు సంబంధించి జగన్‌పై 38 కేసులున్నాయని గుర్తుచేశారు. రూ.43వేల కోట్ల దోపిడీపై సీబీఐ, ఈడీ చార్జిషీటు దాఖలు చేసిందన్నారు. 14ఏళ్ల సీఎంగా చేసిన చంద్రబాబుపై ఎటువంటి అవినీతి, అక్రమాలకు పాల్పడకపోయినా అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

వీఆర్వో అబ్బులుకు బాడీబిల్డింగ్‌లో గోల్డ్‌మెడల్

ఆలమూరు, జనవరి 13: అమలాపురంలో జరిగిన జిల్లా బాడీ బిల్డింగ్ పోటీల్లో కలవచర్ల వీఆర్వో అబ్బులు గోల్డ్‌మెడల్ సాధించారు. అమలాపురం హెల్త్ ఫిట్‌నెస్ జిమ్ ఆవరణలో కంకిపాటి వెంకటేశ్వరరావు నిర్వహించిన గోదావరి జోనల్ మాస్టర్స్ బాడీబిల్డింగ్ పోటీల్లో అబ్బులు ఈఘనత సాధించారు. గోల్డ్ మెడల్‌ను నాయకులు ఒంటెద్దు వెంకన్ననాయుడు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, ఎనుముల కృష్ణపద్మరాజు అందించారు. అబ్బులును నాయకులు రామిరెడ్డి, కర్రి వీర్రెడ్డి, చల్లా ప్రభాకరరావు, రాయపాటి రాంబాబు, మట్టా నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం

మామిడికుదురు, జనవరి 13: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంపాత దేవాలయంలో రూ.1.80లక్షలతో ఫ్లోరింగ్ తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం ప్రారంభించారు నిత్యహోమం, శ్రీలక్ష్మీనారాయణ హోమం నిర్వహించేందుకు దాతల సహకారంతో నిర్మించిన హోమశాలనుప్రారంభించారు. దాతలు సుంకరబాలాజీ-సత్యవేణి దంపతులు, చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సహాయకమిషనర్ జి.మాధవి, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మివెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు

కాట్రేనికోన, జనవరి 13: నవభారత రూరల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అడవిపేటలో శనివారం క్రికెట్ టోర్నమెంట్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు ప్రారంభించారు ఈపోటీలు ఈ నెల16వరకు జరుగతాయని నిర్వాహకులు తెలిపారు. విన్నర్‌కు రూ.30వేలు, రన్నర్‌కు రూ.15వేలు నగదు బహుతులుంటాయన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ అంగాడి రేవతి, రామకష్ణ పాల్గొన్నారు.

- మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు
- సభ విజయవంతానికి సమావేశాలు
- మండపేటలో 20న భారీ బహిరంగ సభ

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



ముమ్మిడివరం: సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు

ముమ్మిడివరం, జనవరి 13: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని తాడి నరసింహారావు స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అధ్యక్షతన శనివారం జరిగిన తెలుగుదేశం-జనసేన పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో చిక్కాల మాట్లాడారు. దేశంలోరాజధాని లేని రాష్ట్రంగా ఒక ఆంధ్రప్రదేశ్ మాత్రమే ఉందని, ఇది జగన్మోహన్‌రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. సభకుఅధ్యక్షత వహించి మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ ఈనెల20న మండపేట నియోజకవర్గంలో రా.. కదిలిరా.. సభకు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ మాట్లాడుతూ టీడీపీ, జనసేనలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, గుద్దటి జమి, గొలకోటి దొరబాబు, సానబోయిన మల్లికార్జునరావు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, అర్థాని శ్రీనివాసరావు, తాడి నరసింహారావు, జనసేన పరిశీలకుడు గదుల సాయిబాబు, వొమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, మోకా బాలప్రసాద్, ముత్యాల జయలక్ష్మి, పొత్తూరి విజయభాస్కరవర్మ, దొమ్మేటి రమణకుమార్, సాగిరాజు సూరిబాబురాజు, నడింపల్లి సుబ్బరాజు, దాట్ల బాబు, టేకుమూడి లక్ష్మణరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజోలు: మండపేటలో ఈనెల20న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా పాల్గొనే రా.. కదిలిరా.. బహిరంగ సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. తాటిపాకలో శనివారం జరిగిన తెలుగు యువత సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజోలు నియోజకవర్గం నుంచి తెలుగు యువత, తెలుగు మహిళలు, తెలుగు రైతులతో పాటు అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వెళ్లడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చంద్రబాబు పాలనకోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఎంపీపీ కేతా శ్రీను, గుద్దటి చిట్టబ్బాయి, చెల్లింగి జగన్, నాగిరెడ్డి గోపి, పితాని సూరిబాబు, ఉల్లంపర్తి భాస్కరరావు, వలవల శేఖర్, బొక్కా పృథ్వి, చెల్లింగి శ్రీనివాస్, కడలి కిశోర్, మార్టిన్ రాంబాబు పాల్గొన్నారు.

మండపేట: మండపేటలో ఈనెల20న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పాల్గొనే రాకదలిరా భారీ బహిరంగ సభను టీడీపీ, జనసైనికులు విజయవంతం చేయాలని నేతలు పిలుపు నిచ్చారు. స్థానిక జనసేన కార్యాలయంలో శనివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అధ్యక్షతనజరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అనపర్తి మాజీఎమ్మెల్యే, రాకద లిరా సభ సమన్వయకర్త నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. బహిరంగసభ విజయవంతం కోసం తీసుకోవల్సిన చర్యలు గురించి చర్చించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: టీడీపి అధినేత చంద్రబాబు మండపేటలో ఈనెల20న నిర్వహించే రా కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసభకు నియోజకవర్గంలోని ప్రతివార్డు, ప్రతీగ్రామం నుంచి అధికసంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, జనసమీకరణ నియోజకవర్గ పరిశీలకుడు వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, డా. చప్పిడి వెంకటే శ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



కె.గంగవరం: బహుమతులు అందిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

ముమ్మిడివరం, జనవరి 13: జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం ముమ్మిడివరం టీటీఆర్‌నగర్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పార్టీ పీఏసీ కమిటీ సభ్యుడు పితాని బాలకృష్ణ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి పార్టీ తరఫున మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుద్దటి జమి, గోదశి పుండరీష్, జక్కంశెట్టి పండు, సానబోయిన మల్లికార్జునరావు, సానబోయిన వీరభద్రరావు, దూడల స్వామి, కడలి వెంకటేశ్వరరావు, రాయపురెడ్డి బాబి, గొలకోటి సాయిబాబు, గిడ్డి రత్నశ్రీ, పిల్లా అనూష, జగతా సత్య, పెన్నాడ శివ పాల్గొన్నారు.

సత్యవాడలో సంక్రాంతి సందడి

కె.గంగవరం, జనవరి 13: టీడీపీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. బహుమతులు పంపిణీ చేశారు. ఆయా పార్టీ ఇన్‌చార్జ్‌లు రెడ్డి సుబ్రహ్మణ్యం, పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. భోగిమంటలు వేశారు. ఈకార్యక్రమాల్లో అయా పార్టీ నాయకులు మరివాడ సూరిబాబు, సలాది రమేష్, సలాది సత్తిబాబు, సలాది ఎర్రిబాబు, సలాది శ్రీను, దేవరపల్లి చక్రి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన

మామిడికుదురు, జనవరి 13: జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెదపట్నంలో నిర్వహించిన ముగ్గుల పోటీకి విశేష స్పందన లభించింది. 32మంది ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. మొదటి బహుమతిగా రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యితో పాటు కన్సోలేషన్ బహుమతులు అందించారు. పలువురు పార్టీ నాయకులు జాలెం శ్రీనివాసరాజా, బళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

అంబాజీపేట, జనవరి 13: వాకలగరువు పంచాయతీ పరిధి బుల్లియ్యకాలనీలో విప్రోకంపెనీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, విప్రో కంపెనీ ప్రతినిధి కె.వెంకటేశ్వరరావు, టీవీవీ సూర్యనారాయణ, ఆనందకుమార్, వాకపల్లి శ్రీనివాసరావు, చప్పిడి రాజు, కేతారాజు, పంచాయతీ కార్యదర్శి వి.లక్ష్మిపతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

17 నుంచి గాడ్ జన్మదిన వేడుకలు



రాయవరం, జనవరి 13: రాయవరం విజయదుర్గా పీఠాధిపతి గాడ్ 88వ జన్మదిన వేడుకలు ఈనెల17,18,19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వి.వి.బాపిరాజు, పీఆర్‌వో బాబి తెలిపారు. శనివారం పీఠంలో గాడ్ జన్మదిన వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు. 17న ఉదయం సుదర్శన మహాహోమం, సాయంత్రం 6 గంటలకు తిరుత్తని అర్చకులతో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, 18న తిరుపతికి చెందిన వైఖానస పండితులచే శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం, సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చనలు, 19న ఉదయం గాడ్ జన్మదినం పురస్కరించుకుని భక్తులతో గాడ్‌కు పాదుకాపూజలు అనంతరం అధ్యాత్మిక సాహితీవేత్తలతో జన్మదిన వేడుక సభ నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో విజయదుర్గాసేవా సమితి సభ్యులు జి.భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, బి.రమ, పెదపాటి సత్య కనకదుర్గ పాల్గొన్నారు.

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాయవరంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

రాయవరం, జనవరి 13: పసలపూడి ఉన్నత పాఠశాల 88-89 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం పాఠశాల ఆవరణలో ఉల్లాసంగా సాగింది. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్తి వీర్రాఘవరెడ్డి, పులగం సత్యనారాయణ రెడ్డి, కె.శ్రీదేవి, వి.చింతారెడ్డి, జి.అనిల్‌కుమార్ రెడ్డి, కె.గోపాల్ రెడ్డి, కె.సుధాకర్ రెడ్డి, సినీ దర్శకుడు కర్రి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కందికుప్ప ఉన్నత పాఠశాలలో 2005-06 టెన్త్‌బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం శనివారం జరిగింది. ఆనాటి గురువులను సత్కరించారు. ఉపాధ్యాయులుజోగయ్యాచార్యులు, ఎస్.వెంకటనారాయణ, కేవీవీ సత్యనారాయణ, కృష్ణమోహన్, హరిబాబు, శ్రీలక్ష్మి, అరుణశ్రీ, సుబ్బరాజు, కుమార్‌రాజా, సూర్యనారాయణ, టీవీ రెడ్డి, రాధాకృష్ణ, దివాకర్ సుబ్రహ్మణ్యం, బ్రహ్మానందం, అంజిబాబు, ప్రజ్ఞానందం, విద్యార్థులు సీహెచ్ సన్నీకుమార్, ఎన్.నరేష్‌రాజ్, పండు సత్యనారాయణ, ఎస్ఎస్‌మూర్తి, టి.సత్యవెంకటప్రసాద్, కె.సంధ్య, వి.సంతోషి, విజయదుర్గ, కె.లోవకుమారి పాల్గొన్నారు.

అంబాజీపేట: అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో 2003-04ఏడాది పదోతరగతి పూర్వవిద్యార్థులు శనివారం ఉత్సాహంగా గడిపారు. దేశ, విదేశాల్లో స్థిర పడిన వారంతాకలుసుకుని ఆప్యాయంగాపలకరించుకున్నారు. యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు.

కొత్తపేట: అవిడి శివారు చప్పిడివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-90 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. అప్పటి గురువులను సత్కరించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు తమ పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. అనంతరం విందు భోజనాలతో ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

అల్లవరం: కొమరగిరిపట్నం జ్ఞాపది సుబ్బారావుపంతులు జడ్పీ హైస్కూల్‌లో2002పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీక కలయిక జరిగింది. సినీపరిశ్రమకు చెందిన తాడాల నాగబాబు, ఆకుల రాము, అమెరికాలో స్థిరపడ్డ అడ్డగళ్ళ దివ్య, భూపతి కృష్ణంరాజు, పోచనపెద్ది వెంకటేష్, మద్దుల శ్రీరామగుప్త, మాధవి తదితరపూర్వవిద్యార్థులు సమావేశమయ్యారు. హెచ్ఎం మంగళంపల్లి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన ఆనాటి హెచ్ఎం జి.సత్యనారాయణమూర్తి, గరిమెళ్ళ స్వామిప్రసాద్, ఎస్‌వీఎస్.దుర్గాప్రసాద్, అర్థాని వరప్రసాద్, ఉపాధ్యాయులు ఆకుల వీరాంజనేయులు కోరుమిల్లి సత్యనారాయణాచార్యులు, కృష్ణప్రసాద్, కేవీ ప్రభాకర్ సన్మానించారు.

రూ.4.95కోట్లతో మంచినీటి చెరువు ఆధునీకరణ

అల్లవరం, జనవరి 13: తీర గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యమని కొమరగిరిపట్నం ప్రజల చిరకాలవాంఛ నెరవేరుతుందని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. కొమరిగిరిపట్నంవెంకన్నచెరువు వద్ద రూ.4.95కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్ చెరువు ఆధునీకరణకు మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి పనుల ప్రారంభానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గోడిలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎన్.పార్థసారధి, ఏఈ జి.స్వామి, తహసీల్దారు ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఎంపీడీవో కృష్ణమోహన్, రుద్రరాజు నానిరాజు, కొనుకు బాపూజీ, తిక్కా వెంకటప్రసాద్, అల్లూరి సురేష్‌రాజు, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, తోట శ్రీదేవి, సుందరనీడి సాయికృష్ణ, ఎంపీటీసీలు ఎం.శ్రీనివాస్, పి.రాజేశ్వరి, కాండ్రేగుల వాణిఅచ్యుతం పాల్గొన్నారు.

రామమందిర అక్షింతలతో భారీ ఊరేగింపు

అల్లవరం, జనవరి 13: కొమరగిరిపట్నంలో అయోధ్య రామమందిర అక్షింతలను మేళతాళాలతో రథంపై ఉంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. ప్రజలకు రామఅక్షింతలను పంపిణీ చేశారు. అల్లూరి సురేష్‌రాజు, రుద్రరాజు నానిరాజు, దాట్ల కృష్ణంరాజు, భూపతిరాజు కృష్ణంరాజు(నన్ని), కొమ్మూరి సత్తిబాబు గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.2,41,126

మామిడికుదురు, జనవరి13: అప్పనపల్లిబాలబాలాజీ స్వామివారికి వివిధ ఆర్జిత ద్వారా శనివారం రూ2,41,126 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ జి.మాధవి తెలిపారు. దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని 3,072మంది భక్తులు దర్శించుకుని, 2,049మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఏసీ మాధవి, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కొమరాడ గ్రామానికి చెందిన కేతా శేషలత రూ.25వేలు విరాళాన్ని అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

రూ.12లక్షలతో సీసీ రహదారి

ఉప్పలగుప్తం, జనవరి 13: విలసవిల్లి గానుగ చెరువు వద్ద రూ.12 లక్షలతో నిర్మించే సీసీ రహదారి పనులను సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ శనివారం ప్రారంభించారు. వైసీపీ గ్రామ కమిటీ చైర్మన్ సలాది సతీష్, కోలా ఏసు, బళ్ల సతీష్, ఉంగరాల నాగేశ్వరరావు, కొల్లు లోకేశ్, పెదపూడి రత్నం, నవుండ్రు దుర్గారావు, పుత్సల ఏసు, గొలకోటి వీరబాబు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: గుంటూరు కారం
వెంకటరమణ	: సైంధవ్
శ్రీలలిత	: గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

విద్యార్థి దశ నుంచి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

అమలాపురం రూరల్, జనవరి 13:బండారులంకకు చెందిన ఉపాధ్యాయుడు టీసీహెచ్ఎస్ మల్లికార్జున్ రాసిన పుస్తకం ప్రణయ బాంధవి ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బండారులంక మాడావారి వీధిలోని కల్యాణ మండపంలో శనివారం ప్రణయ బాంధవి పుస్తకాన్ని ఎమ్మెల్సీ ఐవీ ఆవిష్కరించి ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రముఖ హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ బీఎస్ మోహన్ పుస్తక సమీక్ష చేశారు. కవయిత్రి డి.నాగజ్యోతి, పీవీఎల్ఎన్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల రాజకీయ భవిష్యత్తు మహాసభ కరపత్రం విడుదల

పి.గన్నవరం, జనవరి13: పోతవరంలో ఈనెల28న జరగనున్నహాలో మాదిగఛలో గన్నవరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల మాదిగల రాజకీయ జెఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈసభకు కేంద్రసామాజిక న్యాయ సలహామంత్రి విచ్చేస్తారని, ప్రతీ గ్రామం నుంచి అధికసంఖ్యలో మాదిగ సోదరులు తరలిరావాలని వారు కోరారు. మాదిగల రాజకీయ భవిష్యత్ మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జెఏసీ నాయకులు ఆకుమర్తి చిన్నమాదిగ, చైర్‌పర్సన్ చుట్టుగుళ్ల నీలకంఠం, ఉల్లంపర్తి వీరభాస్కరావు, మడికి శ్రీరాములు, తెన్నేటి రాజబాబు, ఆకుమర్తి ఆశీర్వాదం, ఉందుర్తి నాగబాబు, ఆకుమర్తి శ్రీను, సిహెచ్ శ్రీను, ఆకుమర్తి సత్యనారాయణ, మల్లవరపు వెంకన్న, తవిటికి వీరభిమాన్యుడు, ఈతకోట సత్యనారాయణ, చింతపర్తి భీముడు, సీర్రా వెంకటసత్యనారాయణ, అబ్రహం పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కె.గంగవరం, జనవరి 13: యానాం నుంచి మద్యం సీసాలు తరలిస్తున్న ఇద్దర్ని అరెస్టు చేసినట్లు రామచంద్రపురం సీఐ పి.దొరరాజు చెప్పారు. వారి వద్ద నుంచి తొమ్మిది యానాం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సంక్రాంతి పండుగల్లో కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యక్రమాలు జరిపినచో చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పామర్రు ఎస్ఐ జానీ బాషా ఉన్నారు.

రూ.1.48లక్షల యానాం మద్యం పట్టివేత

ఐ.పోలవరం, జనవరి 13: అక్రమంగా కారులో తరలిస్తున్న రూ.1,48,680 విలువైన యానాం మద్యాన్ని శనివారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. 750ఎంఎల్ పరిమాణంగల 180 మాన్షన్‌హౌస్ బాటిల్స్, అదే పరిమాణంగల 48రాయల్ స్టాగ్ బాటిల్స్, 120 రాయల్ స్టాగ్ 375ఎంఎల్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని, గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన డొక్కు సుబ్బరాజు, అంకిశెట్టి బాలాజీలను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

రైల్వే ప్రాజెక్టును పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి

అమలాపురం రూరల్, జనవరి 13: కోనసీమ రైల్వేలైన్ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధుల బృందం శనివారం ఈదరపల్లిలో జనహిత కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కేంద్ర ప్రతినిధి వారణాసి రాంమాధవ్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు రైల్వే బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేసిన విషయాన్ని సభ్యులు రాంమాధవ్‌కు గుర్తు చేశారు. స్థల సేకరణ, అలైన్‌మెంట్ పనులు పూర్తిచేసి ఎటువంటి కాలయాపన లేకుండా కోనసీమ రైల్వేలైన్ ప్రాజెక్టు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కేఆర్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, బీఎస్ మూర్తి, ఉప్పుగంటి భాస్కరరావు, యర్రమిల్లి పాండురంగారావు, పోలిశెట్టి శివాజీ, యరగర్త వెంకటేశ్వరరావు, దొమ్మేటి సత్యనారాయణమూర్తి, యాళ్ల దొరబాబు పాల్గొన్నారు.

గుండాటలిస్తేనే కోడి పందాలు

ఉప్పలగుప్తం, జనవరి 13: ఎస్.కొత్తపల్లి, ఎస్.యానాం, చల్లపల్లి, వాడపర్రు ప్రాంతాల్లో కోడి పందాల నిర్వహణకు అనుమతి కోసం పోలీసు స్టేషన్ల వద్ద పడిగాపులు పడుతున్నారు. గత ఏడాది నష్టాల కారణంగా జూద క్రీడలు అనుమతించకపోతే కోడి పందాల నిర్వహణ విరమించుకుంటామని నిర్వాహకులు అంటున్నారు. అయితే పోలీసులు మాత్రం శనివారం పందెం బరులను పరిశీలించి ధ్వంసం చేశారు. కోడిపందాలు, జూద క్రీడల కోసం అధికార పార్టీ నాయకులు పోలీసు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

రెండు గ్రామాల నుంచి నాయకులు టీడీపీలోకి చేరికలు



ఆలమూరు, జనవరి 13: మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో చింతలూరు, పెదపళ్ల గ్రామాల్లో పలువురు నాయకులు టీడీపీలో చేరారు. బండారు సత్యానందరావు అధ్వర్యంలో పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన పెదపళ్ల గ్రామానికి చెందిన ఎల్ఐసీ వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు చింతలూరులో చింతలూరు ఫణికుమార్ సమక్షంలో పలువురు యువకులు పార్టీలో చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెం టౌన్ సీఐగా ఆంజనేయులు



రావులపాలెం, జనవరి 13: రావులపాలెం పోలీస్‌స్టేషన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌గా అప్‌గ్రేడ్ అవ్వడంతో మొట్టమొదటి టౌన్ సీఐగా సీహెచ్ ఆంజనేయులు శనివారం బాధ్యతలు చేపట్టారు. తణుకు రూరల్ సీఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి కానుకలు

ద్రాక్షారామ, జనవరి 13:వెంకటాయాపాలెంలో ఎంపీటీసీ సభ్యురాలు కణితి వెంకటేశ్వరి రాంబాబు శనివారం పారిశుధ్య కార్మికులకు కిరాణాసామగ్రి, నగదు అందజేశారు. జనసేన మండల అధ్యక్షుడు పోతాబత్తుల విజకుమార్, గ్రామ అధ్యక్షుడు మంచం పాపారావు, నాని పాల్గొన్నారు. అన్నాయిపేటలో సర్పంచ్ పెమ్మిరెడ్డి నాగేశ్వరరావు పారిశుధ్య కార్మికులకు నూతనవస్త్రాలు అందజేశారు. ఉపసర్పంచ్ చల్లా బుజ్జి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు ప్రారంభం

కె.గంగవరం, జనవరి13: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శనివారం కె.గంగవరంలోని నూతనంగా నిర్మించిన సచివాలయం1,2 భవనాలను ఆయన ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, జడ్పీటీసీ ఓబిళినేని శ్రీవరలక్ష్మి రాజ్‌కుమార్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, సర్పంచ్ కోటి లక్ష్మినరసమ్మ వెంకట్రావు, తోకల శ్రీను, పంపన సత్యానందం, జుత్తుగ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

అమలాపురం టౌన్, జనవరి 13: సంక్రాంతి నేపథ్యంలో అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లోని వస్త్ర దుకాణాలు శనివారం కిక్కిరిసాయి. ఈదరపల్లి వంతెన, ముమ్మిడివరం గేటుసెంటర్, నల్లవంతెన, హైస్కూలు సెంటర్, ముస్లింవీధి ప్రాంతాల్లో ట్రాఫిక్ తరచూస్తంభించిపోయింది. ట్రాఫిక్ నియంత్రణకు డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బంది ఉదయం నుంచి రాత్రి వరకు వారు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. ఇక వాహన చోదకుల పరిస్థితి దయనీయంగా మారింది.

నిరుపేద విశ్వబ్రాహ్మణులకు సంక్రాంతి కానుకలు

అమలాపురం టౌన్, జనవరి 13: అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో శనివారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ యువజన సంఘం, కోనసీమ విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు ఆవుపాటి వేణుగోపాల్ ఆధ్వర్యంలోనిరుపేద విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు సంక్రాంతి కానుకగా నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

ఫ్లెక్సీలు తొలగింపు

కొత్తపేట, జనవరి 13: కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవాన్ని ఘనంగా జరపుకునేందుకు ఉత్సవ కమిటీలతో కలిసి అధికారులు భారీ సన్నాహాలు చేశారు. అయితే పోటాపోటీ బాణసంచా కాల్పులు జరిపే ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం చుట్టూ వివిధ పార్టీలకు చెందిన వారు సినీ అభిమానులు ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి ప్రాంగణాన్ని మూసివేశారు. అయితే బాణసంచా కాల్పులను చూసేందుకు వీలులేకుండా ఫ్లెక్సీలతో ముంచెత్తడంతో ముందుగా డీఎస్పీ కేవీ రమణ శాంతికమిటీ సమావేశంలోనే ఫ్లెక్సీలు తొలగించాలని సంకేతాలు ఇచ్చారు. సంక్రాంతి రోజున జరిగే ప్రభల ఉత్సవంలో ఈ ఫ్లెక్సీలతో ఎటువంటి వివాదాలు తలెత్తుతాయోనని ఆలోచించిన అధికారులు అక్కడ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి పంచాయతీ సిబ్బంది సహకారంతో పోలీసుల ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను, సినీ అభిమానుల ఫ్లెక్సీలను తొలగించారు.

మొగళ్ళమూరులో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

అల్లవరం, జనవరి 13: మొగళ్ళమూరులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై ఇటీవల వివాదం తలెత్తగా ఎం.అంబికాప్రసాద్ శనివారం స్థలాన్ని పరిశీలించారు. పంటకాలువ నుండి డ్రైయిన్ మధ్యలో ఉన్న స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని దళిత యువకులు డీఎస్పీని కోరారు. వివాదం లేకుండా సామరస్యంగా స్థల నిర్ధారణ చేసుకోవాలని డీఎస్పీ ఉభయులకు సూచించారు. రూరల్ సీఐ పి.వీరబాబు, గ్రామసర్పంచ్ రాయుడు విష్ణు త్రిమూర్తులు, ఎస్ఐ జి.హరీష్‌కుమార్, దళితులు పాల్గొన్నారు.

తాలుకా అగ్నికుల క్షత్రియ అధ్యక్షుడిగా బాబ్జి

అల్లవరం, జనవరి 13: అమలాపురం తాలుకా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఓడలరేవుకు చెందిన సీనియర్ టీడీపీ నేత కొల్లు సత్యనారాయణమూర్తి(బాబ్జి)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 24గ్రామాల అగ్నికుల క్షత్రియ పెద్దలు కొల్లును అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.

కేంద్రం నిధులు వైసీపీ ప్రభుత్వం కాజేసేందుకు యత్నాలు

అంబాజీపేట, జనవరి 13: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అందిస్తున్న ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.988కోట్లు నిధులు విడుదల చేయగా రూ.388కోట్లు మాత్రమే రాష్ట్రంలో పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు అందించిందని, మిగిలిన రూ.600కోట్లు ఏం అయ్యాయో తెలియడంలేదన్నారు. తక్షణం రూ.600కోట్లు జమచేయాలని డిమాండ్ చేశారు. గతంలో పక్కదారి పట్టించిన ఆర్థిక సంఘం నిధులతో పాటు ప్రస్తుతం రూ.600కోట్లు పంచాయతీలకు జమచేయాలని డిమాండ్ చేశారు.

యూడీసీ నియామక ఉత్తర్వులు అందజేత

యానాం, జనవరి 13: పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న యూడీసీ ఉద్యోగాలకు ఎంపికైన 104మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను సీఎం రంగసామి అందజేశారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం అందజేశారు. వీరిలో యానానికి సంబంధించి నక్కా చైతన్య, మహ్మద్ షారుఖ్, పేరాబత్తుల వీరబాబు, దేవన రాజు, బందకవి సాయికృష్ణ, దంగుడుబియ్య వీరనాగలక్ష్మి, సుబ్రహ్మణ్య మహేష్‌లు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్నారు.

15నుంచి 17వరకు సెలవులు

యానాం, జనవరి 13: యానాం నియోజవర్గంలో పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలకు సంక్రాంతి సెలవులను ఈనెల 15నుంచి 17వరకు ప్రకటిస్తూ పుదుచ్చేరి విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.